## క్లుప్తంగా

### హరినామ సంకీర్తనతో ప్రశాంతత



ఇస్కాన్‌లో జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ మూర్తులు

కర్నూలు కల్చరల్: హరినామ సంకీర్తన జపంతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఇస్కాన్ ప్రవచకులు శ్రీనివాస కరుణేశదాస్ ప్రభు అన్నారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో ఆదివారం భగవద్గీత శిక్షణా తరగతులు, శీల ప్రభుపాద ప్రేమ విందు కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం భగవద్గీత పఠనం, శ్రవణం చేయాలన్నారు. ఉత్తమ జీవిత గమనానికి మార్గదర్శకంగా ఉంటుందన్నారు. ఎన్నో క్లిష్ట సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. అనంతరం హరే రామ హరే కృష్ణ మంత్రాన్ని జపం చేయించారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

### నేడు గాడిచర్ల జయంతి

కర్నూలు కల్చరల్: ఏపీ గ్రంథాలయ సంఘం, గాడిచర్ల ఫౌండేషన్, సాహితీ సదస్సు సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో గాడిచర్ల హరిసర్వోత్తమరావు 143వ జయంతి, మేడూరి దీక్షితులు వెంకట సుబ్బయ్య 115వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని 29వ గాడిచర్ల పురస్కారాన్ని ప్రదానం చేస్తునట్లు గాడిచర్ల ఫౌండేషన్, సాహితీ సదస్సు అధ్యక్షుడు చంద్రశేఖర కల్కూర తెలిపారు. ఈ ఏడాది మనసు ఫౌండేషన్ డాక్టర్ మన్నం వెంకటరాముడుకు ప్రదానం చేస్తున్నట్లు పేర్కొన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్, రాజ్య సభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్, డీఈఓ శామ్యూల్ పాల్ అతిథులుగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

### క్రీడలతో ఆరోగ్యం



క్రీడాకారులకు కలర్ బెల్టులు అందజేస్తున్న డాక్టర్ జయనారాయణ రెడ్డి

కర్నూలు (టౌన్): క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వైద్యులు డాక్టర్ జయ నారాయణ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఉన్న కరాటే హాలులో కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు సర్టిఫికెట్లు, కలర్ బెల్టులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల వల్ల మానసికంగా, శారీరకంగా ఆరోగ్యవంతులుగా ఉంటారని, కరాటే వంటి ఆత్మరక్షణ క్రీడ విద్యార్థినీ, విద్యార్థులకు అవసరమన్నారు. ఆంధ్రప్రదేశ్ కరాటే సంఘం సభ్యుడు కోలా ప్రతాప్, మాస్టర్ ప్రణీత్ పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ శ్రీధర్ రెడ్డి

కర్నూలు (టౌన్): రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో సత్తా చాటాలని స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ న్యాయవాది శ్రీధర్ రెడ్డి సూచించారు. ఆదివారం స్థానిక దేవనగర్‌లోని గుడ్ షప్పర్డ్ క్రీడా మైదానంలో 17వ రాష్ట్రస్థాయి మినీ సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే క్రీడల్లో సాధన చేయడం వల్ల విద్యార్థులు ఆరోగ్యంగా ఉండటంతో పాటుభవిష్యత్తులో విద్యా, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చన్నారు. రాష్ట్ర హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, పీఈటీల సంఘం అధ్యక్షుడు చిన్న సుంకన్న పాల్గొన్నారు.

# గోడలు కూల్చి షాపుల ఏర్పాటు!

- అడ్డగోలుగా వెలుస్తున్న దుకాణాలు
- కౌన్సిల్‌లో తీవ్ర వాగ్వివాదం
- చర్యలు తీసుకుంటామన్న కమిషనర్
- నెల రోజులు గడిచినా కన్నెత్తి చూడని అధికారులు

కర్నూలు (టౌన్): 'గత నెల ఆగస్టు 2న నిర్వహించిన నగరపాలక సర్వసభ్య సమావేశంలో రెవెన్యూ, ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ విభాగాల్లో అవినీతిపై కౌన్సిల్ సభ్యులు పెద్ద రచ్చ చేశారు. వైఎస్సార్‌సీపీకి చెందిన కార్పొరేటర్లు షేక్ అహమ్మద్, జుబేర్, క్రిష్ణకాంత్ మున్సిపల్ అధికారుల అవినీతిపై ధ్వజమెత్తారు. అనధికారికంగా షాపులు వెలుస్తున్నా చర్యల్లేవని వాగ్వివాదానికి దిగారు. షాపుల నుంచి డబ్బులు ఏవరు వసూలు చేస్తున్నారు? ఎంత వసూలు చేస్తున్నారు? నగరపాలక సంస్థకు జమ అవుతుందా? అని కౌన్సిల్ సమావేశంలో సభ్యులు రభస చేశారు. స్పందించిన కమిషనర్ విచారణ చేస్తాం. మెమోలు ఇస్తాం. వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కమిషనర్ చెప్పి ఇప్పటికి 40 రోజులు అవుతుంది. ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది. మెమోలు లేవు. చర్యలు లేవు. ఇదీ.. నగరపాలక సంస్థ అధికారుల పనితీరు.'



చిల్డ్రన్స్ పార్కులో గోడ కూల్చి అక్రమంగా ఏర్పాటు చేసిన షాపు

**గొడను కూల్చేసి అక్రమంగా షాపుల ఏర్పాటు**

స్థానిక చిల్డ్రన్స్ పార్కులో రెవెన్యూ విభాగం బహిరంగ వేలం నిర్వహించి రూ.1.20 కోట్లకు లీజుకు ప్రైవేటు వ్యక్తికి అప్పగించింది. అయితే ఇటీవల సందులో సడేమియ్యా అంటూ పార్కు ప్రహరీ గోడను కూల్చేశారు. దర్జాగా షాపులు, టిఫిన్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. సదరు వ్యక్తులు మున్సిపల్ అదికారులకు మామూళ్లు ఇచ్చుకొని అనధికారికంగా వీటిని ఏర్పాటు చేసుకున్నారు. వాస్తవానికి అనుమతి లేకుండా, టెండర్ లేకుండా మున్సిపల్ ఆస్తులకు సంబంధించిన ప్రహరీని కూల్చేశారు. ఎవరికి చెప్పకుండా కూల్చేయడం, షాపులు ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు చేసుకుంటున్నా అదే దారిలో మున్సిపల్ అధికారు లు, రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఎందుకు పట్టించుకోలేదు. రెవెన్యూ విభాగానికి కనీసం సమాచారం లేకుండా ఏర్పాటు చేయడం గమనార్హం.

**విచారణ చేస్తాం..**

నగరపాలకలో అవినీతిపై కౌన్సిల్‌లో రచ్చ కావడంతో కమిషనర్ పి.విశ్వనాథ్ స్పందించారు. అక్రమంగా షాపులు వెలసినా కనీసం రెవెన్యూ విభాగానికి తెలియకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విచారణ చేస్తామని, చర్యలు తీసుకుంటామని, నిర్లక్ష్యం ప్రదర్శించిన రెవెన్యూ సిబ్బందిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటికి పుణ్య కాలం ముగిసింది. అయినా ఎటువంటి చర్యల్లేవు. గొడలు కూల్చేసి షాపులు అక్రమంగా ఏర్పాటు చేసుకున్న వారిపై చర్యలు లేకపోవడం పాలన తీరుకు నిదర్శనం.

## ముస్లింల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం



మాట్లాడుతున్న ఎంఏ చిస్తి

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం ముస్లింల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని, ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదని ఆవాజ్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి ఎంఏ చిస్తి విమర్శించారు. ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఆయన మాట్లాడుతూ.. ముస్లిం మైనార్టీలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని చెప్పి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఈద్గాలు, శ్మశానాలకు స్థలాలు కేటాయిస్తామని చెప్పి పట్టించుకోవడం లేదన్నారు. ఇమామ్‌లు, మౌజమ్‌లకు ఇచ్చే పారితోషికాలను ఇవ్వడం లేదని, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా యువతకు స్వయం ఉపాధి కల్పించడం లేదని విమర్శించారు. నాయకులు ఎస్ఎండీ షరీఫ్, ఇస్మాయిల్, అబ్దుల్ నయీం, అబ్దుల్ రహమాన్, ఇంతియాజ్ పాల్గొన్నారు.

**గాడిచెర్లకు నివాళి**

ఓర్వకల్లు: గ్రంథాలయ ఉద్యమ పితామహుడు, భారత స్వాతంత్ర్య సమరయోధుడు గాడిచెర్ల హరిసర్వోత్తమరావు జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని నన్నూరు శాఖ గ్రంథాలయంలో కౌసల్య ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. పిల్లలకు మిఠాయిలు పంచిపెట్టారు.

# పోషక లోపాలను నివారించాలి



మాట్లాడుతున్న ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సుజాతమ్మ

కర్నూలు(అగ్రికల్చర్): పంటల్లో పోషకాల లోపాలను సకాలంలో గుర్తించి నివారించకపోతే దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతుందని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.సుజాతమ్మ అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సమావేశ మందిరంలో ఇన్‌పుట్ డీలర్లకు దేశీ డిప్లొమా కోర్సు కింద శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. అథితిగా హాజరైన సుజాతమ్మ మాట్లాడుతూ.. పంటలకు స్థూల, సూక్ష్మ పోషకాలు మోతాదు మేరకు అవసరమని, తక్కువైతే పంట ఎదుగుదల కోల్పోవడంతో పాటు ఎర్రబారడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. అధిక వర్షాల వల్ల పత్తిలో మెగ్నీషియం లోపం కనబడుతోందన్నారు. నివారణకు మెగ్నీషియం సల్ఫేటు ఒక లీటరు నీటికి 5 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. రసం పీల్చే పురుగుల నివారణకు పొలంలో జిగురు అట్టలు ఎకరాకు 10-20 ఏర్పాటు చేయాలన్నారు. యూరియా పరిమితికి లోబడి, ఎంటీపీ ఎకరాకు 20 కిలోలు వేయాలని సూచించారు. విశ్రాంత జేడీఏ, దేశీ కార్యక్రమ సమన్వయకర్త జయచంద్ర మాట్లాడుతూ.. పోషక లోపాలను గుర్తించడంపై ఇన్‌పుట్ డీలర్లు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. వివిధ మండలాల ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.

## నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించుకోవాలని సూచించారు. అలాగే అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లో అధికారులు అందుబాటులో ఉండి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని వివరించారు.

**అర్జీల సమాచారం కోసం 1100 ఫోన్ నంబర్**

పీజీఆర్ఎస్‌లో ఇచ్చిన అర్జీ పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవాలన్నా కాల్ సెంటర్ నంబర్ 1100కు ఫోన్ చేయ వచ్చని కలెక్టర్ తెలిపారు. అలాగే అర్జీదారులు meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో కూడా అర్జీలను నమోదు చేసుకోవడానికి అవకాశం ఇచ్చినట్లు వెల్లడించారు.

**నగరపాలక సంస్థలో..**

కర్నూలు (టౌన్) :నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏవైనా సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

# వాస్తవాలతో జర్నలిజం కొనసాగించాలి



మాట్లాడుతున్న అలపాటి సురేష్‌కుమార్

కర్నూలు(సెంట్రల్): ప్రజలకు ప్రయోజనం కలిగే వాస్తవాలతో జర్నలిజం కొనసాగించాలని సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్ సూచించారు. ఆదివారం మౌర్య ఇన్‌లోని పరిణయ ఫంక్షన్ హాలులో గ్రామీణ విలేకరుల రెండో రోజు పునశ్చరణ తరగతులు జరిగాయి. ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ.. విలేకరులు గౌరవంతో పనిచేయాలని, స్థాయిని తగ్గించుకునే విధంగా ప్రవర్తన ఉండకూడదన్నారు. ఆత్మవిమర్శ చేసుకొని జర్నలిస్టుగా రాణించాలన్నారు. కర్నూలు పార్లమెంట్ సభ్యుడు బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ.. జర్నలిజం చాలా గొప్పదని, తన దినచర్య పత్రికలు చదవడంతోనే ప్రారంభమవుతుందన్నారు. విలేకరులు శాస్త్ర సాంకేతిక అంశాలను తెలుసుకొని వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. అడిషినల్ ఎస్పీ హుస్సేన్ పీరా మాట్లాడుతూ.. సోషల్ మీడియా యుగంలో సమాచారం సంక్షిప్తంగా, సూటిగా ఉండేలా చూసుకోవాలన్నారు. సమాచార డీడీ జయమ్మ, రిసోర్స్ పర్సన్‌లు సుందరం, శంకర నారాయణ, ఉమా మహేశ్వరరావు, ఐవీ సుబ్బారావు, శ్రీనివాస రెడ్డి, కొండప్ప, రాజు, నాగరాజు గౌడ్ పాల్గొన్నారు.

## ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

కర్నూలు సిటీ: కోడుమూరు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం వల్లే విద్యార్థులను తేనెటీగలు కుట్టాయని, విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ యూత్ విభాగం జిల్లా అధ్యక్షుడు మహేందర్ నాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. స్కూల్‌లో సమస్యలను పట్టికుకోకుండా ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయించడం లేదని, టాయిలెట్లు శుభ్రంగా ఉంచడం లేదని, చిన్న చిన్న మరమ్మతులను సైతం చేయించడం లేదన్నారు. జిల్లా కలెక్టర్, డీఈఓ విచారణ చేయించి ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శివప్రసాద్ గౌడ్, పీపుల్స్ స్టూడెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ బాలికల కార్యవర్గం ఎన్నిక

కర్నూలు సిటీ: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) బాలికల విభాగం జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం నగరంలోని ఓ కాలేజీలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆ సంఘం బాలికల విభాగం రాష్ట్ర కమిటీ సభ్యురాలు అమూల్య, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాయి ఉదయ్, రంగప్ప పాల్గొని ప్రసంగించారు. విద్యాసంస్థల్లో విద్యార్థినులకు రక్షణ కల్పించాలన్నారు. తల్లిదండ్రులు ఇప్పుడిప్పుడే అమ్మాయిలను చదివిస్తున్నారని, ఇలాంటి సమయంలో విద్యా సంస్థల్లో బాలికలకు రక్షణ లేకుండా పోయిందని, ఇటీవల కాలంలో విద్యార్థినులపై లైంగిక వేధింపులు, దాడులు పెరిగిపోయాయని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యా సంస్థల్లో అమ్మాయిల రక్షణపై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం ఆ సంఘం బాలికల విభాగం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా సంయుక్త, కో-కన్వీనర్లుగా శ్రీలక్ష్మీ, వాణి, ఊర్మిల, రజినీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న జేవీవీ అధ్యక్షుడు రమణయ్య

కర్నూలు కల్చరల్: ప్రతి ఒక్కరు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని రాష్ట్ర జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు ఏవీ రమణయ్య అన్నారు. కర్నూలు నగరంలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి జన విజ్ఞాన వేదిక ఉపన్యాస జాతా ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు శాస్త్రీయ దృష్టిని అలవర్చుకోవాలని అప్పుడే వ్యక్తిగత, కుటుంబ, వృత్తి సమాజ జీవితాల్లో మనకు నష్టం జరగకుండా ఉంటుందన్నారు. 1 నుంచి 10వ తరగతి వరకు సైన్స్ పుస్తకాల్లో శాస్త్రీయంగా తేలిన విషయాలనే బోధిస్తారన్నారు. మూడ నమ్మకాలను విడనాడాలన్నారు. జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.విశ్వనాథ్, జేవీవీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి, నాయకులు శేషాద్రిరెడ్డి, రమేష్, రెడ్డెప్ప, మహమ్మద్ మియ్యా, కడప రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## తలసీమియా పిల్లలకు వైద్య పరీక్షలు

కర్నూలు(హాస్పిటల్): తలసీమియా పిల్లలకు హెచ్ఎల్ఏ టెస్ట్ ద్వారా సిబ్లింగ్ మ్యాచ్ అయితే బోన్ మ్యారో మారుస్తారని బెంగళూరులోని ఆస్టర్ సీఎంఐ హాస్పిటల్ ఆంకాలజిస్టు, హెమటాలజిస్టు డాక్టర్ రఘురాం చెప్పారు. ఆదివారం స్థానిక బుధవారపేటలోని కేశవ మెమోరియల్ స్కూల్‌లో సక్షం, డీఈఐసీ, ఆస్టర్ సీఎంఐ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో తలసీమియా పిల్లలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 30 మంది పిల్లలకు, వారి తల్లిదండ్రులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ రఘురాం మాట్లాడుతూ.. బోన్ మ్యారో ఆపరేషన్‌తో రోగులు పూర్తి స్థాయిలో కోలుకుంటారని చెప్పారు. డీఈఐసీ(కర్నూలు) డాక్టర్ సృజనారెడ్డి మాట్లాడుతూ తలసీమియా పిల్లలకు శరీరంలో ఐరన్ డిపాజిట్ గాకుండా చూడాలని, హెచ్‌బీ లెవెల్ 9కి మించి ఉండేలా చూసుకోవాలన్నారు. డీఈఐసీ కర్నూలు మేనేజర్ డాక్టర్ ఇర్ఫాన్, ఆర్‌బీఐ ఎంప్లాయి లోకేష్ మాట్లాడారు. సక్షం జిల్లా అధ్యక్షుడు రామ్మూర్తి, ఉపాధ్యక్షుడు ఆర్. పార్థసారథి, దివ్యాంగ సేవా కేంద్ర ప్రముఖ్ కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, రాజారెడ్డి, తలసీమియా సొసైటీ అధ్యక్షులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

## నేరప్రవృత్తికి దూరంగా ఉండాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసు అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): నేరప్రవృత్తికి స్వస్తి పలికి మంచి మార్గంలో పయనించే విధంగా పోలీసు అధికారులు రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు యంత్రాంగం రౌడీ షీటర్లలో మార్పు తీసుకురావడం లక్ష్యంగా కౌన్సెలింగ్ నిర్వహించడం విశేషం. చెడు నడతను వదులుకోవాలని, మంచి అలవాట్లు, పద్ధతులు అలవర్చుకొని సత్ప్రవర్తనతో రాణించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీ షీటర్లలో మార్పు రావాలని ఆకాంక్షించారు.

## నేడు ఎస్‌జీఎఫ్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో సోమవారం స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ -19 విభాగంలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-19 జిల్లా కార్యదర్శి కె.రాఘవేంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో భాగంగా జూడో, నెట్‌బాల్, కలరియపట్టు అలాగే స్థానిక అశోక్‌నగర్ ఆర్‌కే అకాడమీలో రైఫిల్ షూటింగ్ విభాగాల్లో ఎంపిక పోటీలు ఉంటాయని వెల్లడించారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే విద్యార్థులు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల సంతకంతో హాజరు కావాలని సూచించారు. లీప్ యాప్‌లోను క్రీడాకారులు తమ పేర్లను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు.

## యోగా గ్రేడ్-1 న్యాయనిర్ణేతలుగా జిల్లావాసులు



కురువ మునిస్వామి, ముంతాజ్ బేగం

కర్నూలు (టౌన్): యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హర్యానా వేదికగా ఆదివారం నిర్వహించిన ఆన్‌లైన్ గ్రేడ్-1 న్యాయ నిర్ణేతల పరీక్షల్లో జిల్లావాసులు డాక్టర్ ఎస్.ముంతాజ్ బేగం, కురువ మునిస్వామి అర్హత సాధించినట్లు రాష్ట్ర యోగా సంఘం చైర్మన్ దండు లక్ష్మీకాంత రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. వీరిద్దరూ జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచడంపై జిల్లా యోగా సంఘం అధ్యక్షుడు అవినాష్ శెట్టి, జిల్లా సంఘం ఉపాధ్యక్షుడు సాయిక్రిష్ణ, శశిధర్, శ్రీనివాసులు, విజయకుమార్ హర్షం వ్యక్తం చేశారు.

## జిల్లాకు దామోదరం పేరు పెట్టాలి



సంతకాల సేకరణ చేపట్టిన బుధవారపేట వాసులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లాకు మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య పేరు పెట్టాలని మాజీ మేయర్ బంగి అనంతయ్య డిమాండ్ చేశారు. ఆదివారం బుధవారపేటలో కర్నూలుకు సంజీవయ్య పేరు పెట్టాలని సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అతి నిరుపేద కుటుంబం నుంచి వచ్చి అంచెలంచెలుగా ఎదిగిన సంజీవయ్య పేరును జిల్లాకు పెట్టడం ద్వారా సరైన నివాళి అర్పించినట్లు అవుతుందన్నారు. కార్యక్రమంలో రామయ్య, హరి, గిరి, మహేష్, చంద్రశేఖర్, కందుల సుష్మ పాల్గొన్నారు.

## పొంచి ఉన్న ప్రమాదం



దెబ్బతిన్న కాల్వర్టు

కల్లూరు: నగరంలోని కృష్ణానగర్ ఐటీసీ కూడలి సమీపంలో ఉన్న శరీన్‌నగర్, రాఘవేంద్రనగర్ తదితర కాలనీల నుంచి సర్వీస్ రోడ్డు కాల్వర్టు వద్ద గుంత ఏర్పడి రోడ్డు దెబ్బతింది. సుమారు 20 రోజులైన ఇంతవరకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాహనదారులు వాపోతున్నారు. ప్రమాదం పొంచి ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుపై నిత్యం వందల వాహనాలు తిరుగుతుంటాయి. ఎక్కువగా కార్మికులు ద్విచక్రవాహనాలు, ఆటోల ద్వారా ప్రయాణిస్తుంటారు. రోడ్డు మలుపు దగ్గర కాల్వర్టుపై గుంత ఉండడంతో వాహనదారులు ఏమాత్రం అదుపుతప్పినా గుంతలో పడాల్సిందే. రాత్రి సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి దెబ్బతిన్న కాల్వర్టుకు మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.